# గలగలా గోదారి

శైలవయమ్

వెంకయ్యగారు తమ్ముడికోసం ఎదురు చూస్తున్నారు. ఒళ్ళు సలపరింతగా వుంది. గుండె ఆవిరవుతోంది. జీవితం కొట్టిన దెబ్బలకి నడుము వంగిపోయింది. చెయ్యెత్తు మనిషిలో చేవ చచ్చిపోయింది. ఒడిలో. మాటలింకా సరిగా రాని మూడేళ్ళ పసిగుడ్డు. చారలు కట్టిన కళ్ళతో నిద్రపోతోంది. విలాసంగా ఎరుపు నలుపు కలనేత పైటంచుని జారుగా వదిలిన సంధ్యాదేవి ఎర్రంచు నల్లకోక కట్టుకుని విహారానికి బయల్దేరబోతోంది. పెరట్లో. కర్రావు జనపకాడ నములుతూ వుండుండి మోరెత్తి చూస్తోంది. నిట్రాతి పాకలో గుడ్డిదీపం వెలిగించి తమ్ముడికోసం చూస్తున్నారు వెంకయ్యగారు.

వెంకయ్యగారికి పదేళ్ళ వయసప్పుడు. తండ్రి శివసాయుజ్యంపొందారు. మిగిలిన తల్లినీ. ఏడాది తమ్ముణ్ణీ. పదెకరాల మడి చెక్కనీ కాపాడుకుంటూ. గాయత్రినీ. భూదేవినీ నమ్ముకునిపెరిగారు. పదహారేళ్ళ వయసులో తల్లి మాట కాదనలేక వివాహం చేసుకున్నారు. ఆయనకి వివాహమయిన రెండేళ్ళకి. "వెంకప్పా ఆయన పిలుస్తున్నార్రా. ఒంటరిగా ఏమిబ్బంది పడుతున్నారో ఏమో" అని తులసమ్మ దగ్గిర దీపం వెలిగించి. తన దీపం ఆర్పేసుకుంది వెంకయ్యగారి తల్లి. అయిదేళ్ళు కాపరం చేసి పిల్లలు పుట్టలేదన్న బెంగతో వెళ్ళిపోయింది వెంకయ్యగారి భార్య. అప్పట్నించీ తల్లీ, తండ్రీ తనే అయి తమ్ముణ్ణి పెంచుకుంటూ వచ్చారు. ఊళ్ళో పెద్దలందరూ 'మళ్ళీ పెళ్ళి చేసుకో. ఇంట్లో ఆడదిక్కులేకపోతే ఎలాగయ్యా ఎన్నాళ్ళు చెయ్యి కాల్చుకుంటావు!' అని చెప్పినా వినలేదు. తమ్ముడికి గోరుముద్దలు తినిపిస్తూ. గుణింతాలు నేర్పిస్తూ పెంచి పెద్దచేసి లక్షణమైన మహాలక్ష్మిని తెచ్చి పెళ్ళి చేసారు. ఆ ఇంట అడుగుపెట్టిన ఆ కూతుర అర్ధ పుష్కరం చూడదన్నట్లు. ఒక బుల్లిమహాలక్ష్మిని ఆ అన్నదమ్ములకి వదిలేసి. ఆ ఇంటి మహాలక్ష్మి వెళ్ళిపోయింది. ఆ దెబ్బకి తమ్ముడిసంగతేమోగాని, వెంకయ్యగారు కోలుకోడానికి ఆరు నెలలు పట్టింది. ఆ ఆరు నెలలు అన్నగార్ని పసిపిల్లాడిలా కనిపెట్టుకున్నాడు తమ్ముడు రామయ్య.

రామయ్య ఆజానుబాహు మనిషి. దబ్బపండులా ఆరడుగుల పైగా. నిలబడ్డ నిబ్బరంలా వుంటాడు. వెంకయ్యగారితో సున్నితంగా హాస్యాలాడే మనుషులు కూడా. రామయ్యతో మాట కలపడానికి జంకుతారు.

## ఇదం క్షేత్రం....

'మాచెడ్డ ఖదేరావు మనిషండి" అని అనుకోవడం సాధారణ విషయం.

ఇన్ని దెబ్బలు తిన్న ఆ ఊర్లో



ఉండటం రామయ్య కిష్టంలేదు. తాతలనాటి కొంపనీ. నాటినుంచి నమ్ముకున్న భూదేవిని వదిలి రావడమన్నది అన్నగారి బొందిలో ఊపిరుండగా జరగని పనని తెలుసు. అందుకే. ఆ ప్రస్తావన అన్నగారి దగ్గర తేలేదు రామయ్య. అన్నగారు కోలుకున్నాక ఆయనకి నచ్చజెప్పి మొగల్తూరు సంస్థానంలో లేఖకుడిగా చేరాడు. తమ్ముడి ఇంగితం తెలిసిన వెంకయ్యగారు. పెద్దగా అడ్డు చెప్పలేదు. శని. ఆదివారాలు తమ్ముడికి సెలవు. ఆ రెండురోజులు ఇంటికి వచ్చి. అన్నగారితో ఉండి. సోమవారం దివాణానికి వెళ్ళడం రామయ్యకి అలవాటయిపోయింది.

ఆ రోజు శుక్రవారం. చీకట పడింది. తమ్ముడువచ్చే వేళవుతోంది. తమ్ముడి రాక కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు వెంకయ్యగారు. ఒక తొడ మీద తమ్ముడి కూతురు నిద్రబోతోంది. రెండో కాలు మోకాలి వరకు మడిచి. తలనీ నడుమునీ నిట్రాతికి చేరవేసి. ముణగదీసుకున్న బాధలా కూర్చునివున్నారు వెంకయ్యగారు.

అపరాహ్ణంలో జరిగిన విషయం ఆయన్ని అంతరాంతరాల్లో కుదిపి కుదిపి వదుల్తోంది. ఆ కుదుపులకి శబ్దం పైకి రాకపోయినా. డొక్కలుమెల్లిగా ఎగురుతున్నాయి.

వీధి గుమ్మం దగ్గర అలికిడికి తలెత్తిన వెంకయ్యగారికి. లోపలికొస్తున్న రామయ్య కనిపించాడు. 'అన్నయ్యా' అన్న పలకరింపుతో.

"కాళ్ళు కడుక్కోరా" అంటూ. ఒళ్ళో వున్న మాలక్ష్మిని పక్కనున్న బొంతమీద పడుకోబెట్టి. తమ్ముడికి ఆకు పీట వేసి. తనూ పక్కనే ఆకు వేసుకూర్చున్నారు.

అన్నగారి ముఖభావం. రామయ్యకి కొంచెం ఆశ్చర్యమనిపించింది. గబగబా స్నానం ముగించి. పొడి గావంచా కట్టుకుని నుదుట విభూతి రాసుకుని. బొట్టుపెట్టుకుని వచ్చి కూర్చున్నాడు. వెంకయ్యగారు. ఏమీ మాట్లాడకుండా ఆకుల్లో వడ్డించారు.

పీటమీదకూర్చుంటూ. "అలావున్నావేం అన్నయ్యా" అనడిగాడు రామయ్య.

"అబ్బే ఏం లేదురా" అన్న వెంకయ్యగారి గొంతులో జీర.

"ఏదో వుంది. లేకపోతే నువ్వలా బాధపడవు. విషయం చెప్పకపోతే నేను ఆపోశన పట్టేదిలేదు." రామయ్య దృఢంగా అన్నాడు.

ఆదిశంకరుడి మీదకన్నా. అన్నగారి మీదే రామయ్యకి భక్తి ప్రపత్తు లెక్కువ. తమ్ముడి మీద ఎంతటి ప్రేమానురాగాలున్నాయో. అతని తీవ్రస్వభావం పట్ల అంతటి భయమూ వుంది వెంకయ్యగారికి.

తమ్ముడలా అనేసరికి వెంకయ్యగారింక వుండబట్టలేక పోయారు. తమ్ముడ్ని గట్టిగా పట్టుకుని పసిపిల్లాడిలా బావురుమన్నారు.

ఆ వూరికి మునసబు. పెదకాపు

గండయ్యా. ఆరున్నరడుగుల మనిషి. ముంతంత కొప్పు. జానెడు మీసాలు. అతడు రోడ్డు మీద నడుస్తోంటే. ఆడంగులు తలుపులు వేసేసుకుంటారు. బీదా బిక్కి జనం వీధిలో ఎదురుగా నడవరు. ఒకవేళ ఎదురు పడటం సంభవిస్తే గోడల్లోకి ఒదిగి పోతారు. ఊరి పెద్దమనుషులు కూడా తలకాయను పక్కకి తిప్పుకుంటారు ఏదో పని చేస్తున్నట్టు. దానికితోడు వంశపారంపర్యంగా వస్తున్న మునసబు గిరీ.

ఆ రోజు ఉదయం పొలాలకి నీళ్ళు మళ్ళిస్తున్నారు. ఎవరి పొలాలికి ముందు నీళ్ళు అందాలో అన్న విషయంలో ఆ వూరికి కూడా ఒక కట్టడి వుంది. ఎవరూ ఆ కట్టు దాటరు. అది చెలియలికట్ట లాంటిది. వెంకయ్యగారి పొలం తరవాతది గండయ్య పొలం. కట్టడి ప్రకారం వెంకయ్యగారి పొలానికి ముందు నీళ్ళు వదలడం ఆనవాయితీ అలాగే. ఆ రోజు వెంకయ్యగారి పొలానికి నీళ్ళు వదిలారయ్యా. ఇంతలో గండయ్య పెదపాలేరు అడ్డొచ్చి. వెంకయ్యగారి పొలానికి నీళ్ళు ఆపి. తమ పొలానికి మళ్ళించాడయ్యా. అది తెలిసిన వెంకయ్యగారు. వాణ్ణి మందలించి. కట్టడి ప్రకారం తమ పొలానికి నీరు పట్టుకున్నారయ్యా. అంతేనయ్యా సంగతి.

వెంకయగారి మీద కర్రఎత్తే ధైర్యం లేక సదరు పెదపాలేరు. గండయ్యతో విషయం చెప్పాడయ్యా. అది తెలిసిన గండయ్య హుటాహుటిన వెంకయ్యగారింటికే వచ్చాడయ్యా. చంటి పిల్లకి అన్నం పెడుతున్న వెంకయ్యగారిని పిలక పట్టుకుని ఒక గుంజు గుంజి. తన ఎడంకాలి చెప్పుతో కొట్టి నోరు పెగల్చీసి. నోట్లో కల్లు పోసి "సెప్పవయ్యా బేమ్మడా కల్లు తియ్యగా వుందా. పుల్లగా వుందా సెప్పు. గండయ్య కడ్డొచ్చే మొనగాడివి సెప్పు ...." అని; వెంకయ్యగారిని వంచి వీపుమీద రెండు గుద్దులు గుద్ది. మోకాటితో వెనక్కి తోసి. 'బేమ్మడా... గుర్తుంచుకో ....గండయ్యతో యెవ్వారమంటే....' అని వెళ్ళిపోయాడయ్యా.

ఇది విన్న రామయ్య భార్గవరాముడయ్యాడు. పీట మీంచి సర్రున లేచాడు. మూడంగల్లో గండయ్య ఇంటికి చేరాడు. మరో అంగలో గండయ్య ఇంట్లోకి ప్రవేశించి అన్నం గిన్నెముందు కూర్చున్న గండయ్యని కొప్పట్టుకుని. వీధిలోకి ఒక్క వూపున లాగి. మూతి మీద తన్నాడయ్యా. ఆ తన్నుకయ్యా. గండయ్య ముందు పళ్ళు రాలటమూ. కొప్పులో చాలా భాగం రామయ్య చేతిలోకి వూడి రావటమూ. గండయ్య మూర్ఛపోవటమూ జరిగిందయ్యా అంతటితో ఆ రామయ్య ఆగలేదయ్యా. ఆ చీకట్లోనే పడి మొగల్తూరు జేరాడయ్యా. గండయ్య మునసబుగిరీ రద్దు చేయించి. ఆ వూరి పెద్ద రాజుగారికది బదలాయిస్తున్నట్లు తాఖీదు తీసుకుని. వెంట ఇద్దరు దివాణపు బంట్రోతులు తోడురాగా. తెల్లవారేసరికి వూరు జేరాడయ్యా. చేరిననాడు— పెద్దరాజుగారికి ఫర్మానా అందించి. ఆయన తోడురాగా. గండయ్య ముంగిట గర్జించాడయ్యా ఆ గర్జనకి అడ్డొచ్చిన ఆడంగులకి దణ్ణంబెట్టి. వెనకాల దాగున్న గండయ్య మెడమీద చెయ్యేసి. అన్నగారి కాళ్ళమీద పడేశాడయ్యా. పడేసి 'ఒరే గండయ్యా. ఇప్పుడు చెప్పరా....కల్లు రుచి ఎలా వుందో' అనడిగాడయ్యా. భూమ్మీద పడ్డ గండయ్య. భూదేవినే కరుచుకు నుండిపోయాడయ్యా. ఆరు నెలల్లో భూదేవిలోనే కలిసిపోయాడయ్యా.

అయ్యా. అంతక్రితం రాత్రి వడ్డించిన విస్తరికి. ఆ మర్నాటి ఉదయం ఆపోశన పట్టాడయ్యా రామయ్య.

అదయ్యా సంగతి.

